క్లుప్తంగా

బ్రహ్మోత్సవ పనులు ప్రారంభం



మహా ద్వార గోపురానికి విద్యుద్దీపాలు అలంకరిస్తున్న సిబ్బంది

తిరుమల : తిరుమలలో శ్రీవారి బ్రహ్మోత్సవాలకు సంబంధించిన పనులను టీటీడీ ప్రారంభించింది. ఈ మేరకు శ్రీవారి ఆలయ మహాద్వారా గోపురం విద్యుద్దీపాలంకరణకు శ్రీకారం చుట్టారు. అలాగే మహారథానికి ఇంజినీరింగ్ అధికారుల ఆధ్వర్యంలో మరమ్మతులు చేపట్టారు.

త్రిపుర గవర్నర్‌కు ఘన స్వాగతం



ఇంద్రసేనారెడ్డికి స్వాగతం పలుకుతున్న నేతలు

తిరుపతి గాంధీ రోడ్డు : తిరుపతి పర్యటనకు విచ్చేసిన త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డికి గురువారం నగరంలోని పద్మావతి అతిథిగృహం వద్ద బీజేపీ నేతలు ఘన స్వాగతం పలికారు.భాను ప్రకాష్, గుండాల గోపీనాథ్, సుబ్రమణ్యం యాదవ్, వరప్రసాద్, చంద్రబాబు యాదవ్, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, నాదముని, ఏవన్ మస్తాన్ పాల్గొన్నారు.

‘విశ్వం’లో ఇన్‌కమ్ ట్యాక్స్ డే



విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందిస్తున్న అతిథులు

తిరుపతి సిటీ : జీవకోనలోని విశ్వం హైస్కూల్‌లో గురువారం ఆదాయపు పన్ను దినోత్సవం నిర్వహించారు. తిరుపతి సర్కిల్–1 డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ఇన్‌కమ్ ట్యాక్స్ డాక్టర్ కేఎం లక్ష్మణకుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఆదాయపు పన్ను ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించి ప్రశంసాపత్రాలను అందజేశారు. విశ్వం విద్యా సంస్థల డైరెక్టర్ ఎన్.విశ్వ చందన్‌రెడ్డి, ఇన్‌కమ్ టాక్స్ ఇన్‌స్పెక్టర్లు చంద్ర కిరణ్, చేతన్ కుమార్, పి.నీలిమ, చార్టెడ్ అకౌంటెంట్ సుదర్శనం నాయుడు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడికి సత్కారం



జార్జ్‌ని సత్కరిస్తున్న దృశ్యం

పాకాల : మండలంలోని అచ్చమ్మ అగ్రహారం మోడల్ ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జార్జ్ బదిలీపై వెళుతున్న సందర్భంగా గురువారం ఆయనను ఘనంగా సత్కరించారు. ఎంఈఓ బాబ్జీ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి జార్జ్ ఎనలేని కృషి చేశారన్నారు. రాష్ట్రంలో అచ్చమ్మ అగ్రహారం పాఠశాలకు గొప్ప పేరు తీసుకువచ్చారని కొనియాడారు. హెచ్‌ఎం మునీంద్రబాబు, ఉపాధ్యాయులు రజనీప్రియ, నవీన్‌కుమార్, విమల, జోహార్ పాల్గొన్నారు.

తప్పిన పెను ప్రమాదం





చెట్టు నేలకూలడంతో పడిపోయిన విద్యుత్ స్తంభం, దెబ్బతిన్న కారు

తిరుపతి తుడా : నగరంలోని తిలక్‌రోడ్డులో గురువారం పెను ప్రమాదం తప్పింది. వివరాలు.. రోడ్లపై రాకపోకలకు ఇబ్బందికరంగా మారిన చెట్లను తొలగించేందుకు కార్పొరేషన్ హార్టికల్చర్ విభాగం చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో తిలక్‌రోడ్డులోని ఓ భారీ వృక్షాన్ని తొలగించే క్రమంలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారు. చెట్టును ముక్కలు ముక్కలుగా కాకుండా ఒకేసారి మొదలును నరికేయడంతో అది పక్కనే విద్యుత్ స్తంభం, ట్రాన్స్‌ఫార్మర్‌తోపాటు ఓ ఇంటి ప్రహరీ గోడతోపాటు ఓ కారుపై పడిపోయింది. అదృష్టవశాత్తు విద్యుత్ తీగలు తెగి కింద పడిన సమయంలో ఎవరూ అటువైపుగా రాకపోవడంతో ముప్పు తప్పింది. అయితే ప్రహరీ గోడ, కారు అద్దాలు ధ్వంసమయ్యాయి. దీంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్పొరేషన్ సిబ్బందితో గొడవకు దిగారు. ఇలాంటి పనులు చేపట్టే సమయంలో ముందస్తు జాగ్రత్తలు ఎందుకు పాటించలేదని నిలదీశారు. స్థానికంగా ఎవరికీ సమాచారం అందించకుండా చెట్ల నరికివేత చేపట్టడం సరికాదని మండిపడ్డారు. ప్రాణనష్టం జరిగి ఉంటే ఎవరు సమాధానం చెబుతారని ఆవేదన వ్యక్తం చేశారు. డీఈ సర్దిచెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

సంక్షేమం.. సంక్షోభం

50వ డివిజన్‌లో చంద్రబాబు మేనిఫెస్టో మోసాలను ప్రజలకు వివరిస్తున్న భూమన అభినయ్‌రెడ్డి



33వ డివిజన్‌లోని స్కావెంజర్స్‌కాలనీలో రచ్చబండ నిర్వహిస్తున్న అభినయ్‌రెడ్డి



‘కూటమి ప్రభుత్వంలో సంక్షేమం శూన్యంగా మారింది.. పేదల బతుకుల్లో సంక్షోభం నిండింది.. బాబు పాలనంతా వంచనతోనే సాగుతోంది.. అధికారం కోసం చెప్పిన అబద్ధాల ముసుగు వీడింది.. ప్రజలకు అసలు తత్వం బోధపడింది.. ఓట్ల కోసమే అలవికాని హామీలు గుప్పించారని తేటతెల్లమైంది.. పీఠం ఎక్కి ఏడాది పూర్తయినప్పటికీ ఒక్క పథకం కూడా అందించని పాలకుల వైఖరిపై ఆగ్రహం పెల్లుబుకుతోంది.. మాటకు కట్టుబడి సంక్షేమ ఫలాలు అందించిన జగనన్నపై జనంలో ప్రేమాభిమానం ఉప్పొంగుతోంది’ అంటూ వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి స్పష్టం చేశారు. చంద్రబాబు మేనిఫెస్టో మోసాలను క్షేత్రస్థాయిలో వివరించారు.

- కూటమి పాలనలో పథకాలు శూన్యం
- ఏడాది గడిచినా ఒక్కటీ అమలు కాలేదంటున్న జనం
- ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకున్న ప్రభుత్వం
- చంద్రబాబు మేనిఫెస్టో మోసాలను వివరించిన భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు శూన్యమని వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి ఆరోపించారు. గురువారం నగరంలోని 50, 33వ డివిజన్లలో చంద్రబాబు మోసాల మేనిఫెస్టోను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించారు. గత ఐదేళ్ల జగనన్న పాలనలో ఆర్థిక ఇబ్బందులు ఎదురైనప్పటికీ లెక్కచేయకుండా సంక్షేమ పథకాలు అందించారని గుర్తుచేశారు. అర్హులందరికీ లబ్ధి చేకూర్చిన గొప్ప నాయకుడు జగనన్న అని కొనియడారు. అయితే చంద్రబాబు అధికారంలోకి వచ్చాక ఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్నారు. ఇలాంటి వారినా నమ్మి ఓట్లు వేశారు అక్కా... అంటూ ప్రశ్నించారు. చంద్రబాబుకు నమ్మినవాళ్లను వంచించడం తప్ప మాటకు కట్టుబడే తత్వం లేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన పథకాలను ఎందుకు ఇవ్వలేదని మీ ఇళ్ల వద్దకు కూటమి నేతలు వచ్చినప్పుడు చొక్కా పట్టుకుని నిలదీసి అడగాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు మోసం కారణంగా ప్రతి ఇంటిలోని పేదలు ఇప్పటి వరకు రూ. లక్ష నుంచి రూ. 2లక్షల వరకు నష్టపోయారని వివరించారు. ఏడాదిలోనే రాజకీయ చరిత్రలో ప్రజావ్యతిరేకతను మూటకట్టుకున్న ఏకైక నాయకుడిగా చంద్రబాబు నిలిచిపోతారన్నారు. ఎన్నికల్లో చంద్రబాబు సూపర్‌సిక్స్ పథకాలు తల్లికి వందనం, ఆడబిడ్డ నిధి, యాభై ఏళ్ల నిండిన మహిళలకు పెన్షన్, యువతకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఉచిత బస్సు వంటి సంక్షేమ పథకాలు అందిస్తానంటూ నమ్మబలికి ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వంపై ప్రజలు సైతం భగ్గుమంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఆదం రాధాకృష్ణారెడ్డి, బోకం అనిల్‌కుమార్, నేతలు తిరుమలరెడ్డి, కుప్పయ్య, రామకృష్ణారెడ్డి, మద్దాలి శేఖర్, లక్ష్మీ వెంకటేష్, రమణారెడ్డి, గోవిందరెడ్డి, పద్మజ, విజయలక్ష్మి, రాధ, ప్రదీప్, శీను, ఉష చెంగల్రాయులు, సిద్ధయ్య, రమణయాదవ్, రమేష్‌రెడ్డి, సుదీప్, ఇరగమ్మ పాల్గొన్నారు.

నోటీస్ బోర్డు

- అప్పలాయిగుంటలోని శ్రీప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉదయం 7 గంటలకు వస్త్ర అలంకరణ సేవ, అభిషేకం.
- శ్రీవారి సేవా గ్రూప్ ఆధ్వర్యంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు రామచంద్ర పుష్కరిణి ఆవరణలో అష్ట లక్ష్మీ వైభోగ వ్రతం.
- ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఉదయం 10.30 గంటలకు నాలుగు కాళ్ల మండపం వద్ద నిరసన కార్యక్రమం.
- శ్రీగోవిందరాజస్వామి ఆలయంలో ఉదయం 11 గంటలకు శ్రీచక్రత్తాళ్వార్, శ్రీపతివాది భయాంకర అన్నన్ వారి తిరునక్షత్ర వేడుక.
- అగ్రశ్రీ సంస్థ ఆధ్వర్యంలో ఎస్వీయూ సెనేట్ సమావేశ మందిరంలో సాయంత్రం 4 గంటలకు నీలం సంజీవరెడ్డి పురస్కారాల ప్రధానోత్సవ సభ.
- తిరుచానూరులోని పద్మావతి అమ్మవారి ఆలయంలో సాయంత్రం 6 గంటలకు తిరుచ్చి ఉత్సవం.
- అభినయ ఆర్ట్స్ జాతీయ నాటక పోటీలలో భాగంగా మహతి కళాక్షేత్రంలో ఉదయం 9.30 నుంచి నృత్య పోటీలు, సాయంత్రం 4 గంటలకు ‘శ్రీఖడ్గతిక్కన’ పౌరాణిక నాటకం, 6.30 గంటలకు మహిళా వేదిక, రాత్రి 8 గంటలకు ‘అమ్మ చెక్కిన బొమ్మ’ సాంఘిక నాటిక ప్రదర్శన.

నాణ్యమైన ఆహారం తప్పనిసరి

తిరుపతి సిటీ : ఎస్వీయూలోని వసతి గృహాలలో విద్యార్థులకు తప్పనిసరిగా నాణ్యమైన ఆహారం అందించాలని, అలసత్వం వహిస్తే సహించే ప్రసక్తే లేదని వీసీ అప్పారావు స్పష్టం చేశారు. గురువారం వర్సిటీలోని హాస్టళ్ల అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. బుధవారం రాత్రి డి–మెస్‌లో విద్యార్థులకు వడ్డించిన అన్నంలో వానపాము రావడంపై మండిపడ్డారు. విద్యార్థులకు అందించే ఆహారంపై అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. చిన్నపాటి పొరబాటు జరిగినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మెస్‌లో జరిగిన ఘటనపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

పరిశుభ్ర తిరుపతే ధ్యేయం



ఒప్పంద పత్రాలను అందిజేస్తున్న కమిషనర్

తిరుపతి తుడా : పరిశుభ్ర, ఆరోగ్యకరమైన తిరుపతే ధ్యేయంగా పనిచేస్తున్నామని కార్పొరేషన్ కమిషనర్ మౌర్య తెలిపారు. గురువారం ఈ మేరకు నగరంలోని ప్రతి ఇంటి వద్ద చెత్త వేరు చేసి ఇవ్వడంపై ప్రజలకు అవగాహన కల్పించేలా ఐటీసీ తరపున అకాడమీ ఆఫ్ గాంధీయన్ స్టడీస్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులతో ఒప్పందం కుదుర్చుకున్నారు. కమిషనర్ మాట్లాడుతూ వ్యర్థాలను విభజన చేసేలా ప్రజలను ప్రోత్సహించి, స్వచ్ఛ తిరుపతిని సాధించడమే ఈ ప్రాజెక్ట్ లక్ష్యమన్నారు. అలాగే వ్యర్థాల రీసైక్లింగ్, హోమ్ కంపోస్ట్‌పై సైతం ప్రజలకు అవగాహన కల్పిస్తారని వివరించారు. అనంతరం గాంధీయన్ స్టడీస్ ఈడీ గోపాలకృష్ణ మూర్తి, కమిషనర్ మౌర్య ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, ఏజీఎస్ ప్రాంతీయ సమన్వయకర్త కుమారి పాల్గొన్నారు.

వడ్డెర సంక్షేమమే లక్ష్యం



మాట్లాడుతున్న దేవళ్ల మురళి

తిరుపతి కల్చరల్: వడ్డెర సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లువడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవళ్ల మురళి డిమాండ్ చేశారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. వడ్డెర కులస్తులను ఎస్టీల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు వడ్డెర్లకు చట్టసభల్లో అవకాశం రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలోనే మంగళగిరి, గుంటూరు సమీపంలో వడ్డెర మహాసభ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. వడ్డెర సంక్షేమాన్ని ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. కొండ, క్వారీలలో అర్హులైన వడ్డెర్లకు 25 శాతం కేటాయించాలని, కార్మికులకు రూ.25 లక్షల ప్రమాద బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ పనుల్లో 30 శాతం పనులు వడ్డెర్లకు కట్టబెట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో వడ్డెర సంఘం రాయలసీమ అధ్యక్షుడు శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షుడు వడ్డే మదన్‌మోహన్, ఉపాధ్యక్షుడు నాగరాజు, బాల, జగన్నాథ్ పాల్గొన్నారు.

కమిషనర్‌కు అభినందనలు



కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్సీ సిపాయి

తిరుపతి తుడా : నగరపాలక సంస్థ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టి గురువారంతో ఏడాది పూర్తయిన సందర్భంగా కమిషనర్ మౌర్యకు పలువురు అభినందనలు తెలిపారు. కార్పొరేషన్ కార్యాలయంలో ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యామ్ సుందర్, మున్సిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ తదితరుల ఆమెను ఘనంగా సన్మానించారు.

గుర్రం జాషువాకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న సాహితీ వేత్తలు

తిరుపతి అన్నమయ్యసర్కిల్ : మహాకవి గుర్రం జాషువా 54వ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం వేమన విజ్ఞానకేంద్రంలో ఘనంగా నివాళులర్పించారు. జాషువా చిత్రపటానికి పూల మాల వేసి అంజలి ఘటించారు. విజ్ఞానకేంద్రం కార్యదర్శి మల్లారపు నాగార్జున, పరిశోధక విద్యార్థి గరికపాటి రమేష్ బాబు, సాహితీ స్రవంతి నేతలు రమణ, ఆకుల మల్లేశ్వర రావు, రెడ్డెప్ప, డాక్టర్ రవీంద్ర, డాక్టర్ ఆమూరి సుబ్రమణ్యం,రఫీ, ముఖేష్, సంధ్య, లత, ప్రమోద్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ భవన్‌లో..



మాట్లాడుతున్న అంజయ్య

తిరుపతి కల్చరల్ : అంబేడ్కర్, పూలే ఫౌండేషన్, దళిత సాహిత్య వికాస వేదిక ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం అంబేడ్కర్ భవన్‌లో గుర్రం జాషువా వర్ధంతి సభ నిర్వహించారు. దళిత సాహిత్య వికాస వేదిక జిల్లా కన్వీనర్ అంజయ్య, అంబేడ్కర్ పూలే ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పరసారత్నం, ఉమ్మడి జిల్లా జెడ్పీ సీఈఓ వెంకటనారాయణ, సాహితీ మిత్రులు ఆమూరి సుబ్రమణ్యం, గొడుగు చింత గోవిందయ్య వక్తలుగా హాజరై ప్రసంగించారు. నేతలు నాగేశ్వరరావు, స్టార్ కృష్ణ, ప్రసాద్‌రావు, శాంభోల హరి పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ



సుదర్శన్‌నాయుడు కుమార్తెను ఓదారుస్తున్న మాజీ మంత్రి రోజా



కస్తూరమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి రోజా

నగరి: మండల పరిధిలో ఇటీవల మృతి చెందిన వైఎస్ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తల కుటుంబాలను మాజీ మంత్రి ఆర్కే రోజా గురువారం పరామర్శించారు. వైఎస్ఆర్ సీపీ మాజీ మండల కన్వీనర్ సుదర్శన్‌నాయుడు ఇటీవల అనారోగ్యంతో మరణించారు. మేళపట్టు గ్రామంలోని ఆయన నివాసానికి వెళ్లి సుదర్శన్ నాయుడు చిత్రపటం వద్ద పుష్పాలు ఉంచి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. కన్నీటి పర్యంతమైన ఆయన కుమార్తెను ఓదార్చారు. కృష్ణాపురం గ్రామానికి చెందిన వైఎస్ఆర్ సీపీ నాయకుడు సుందరం తల్లి కస్తూరమ్మ ఇటీవల మరణించారు. వారి కుటుంబ సభ్యులను మాజీ మంత్రి ఆర్కే రోజా పరామర్శించారు. ఈ కార్యక్రమాల్లో వైఎస్ఆర్ సీపీ మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డి, వైస్ ఎంపీపీలు కన్నియప్ప, ఢిల్లీబాబు, నాయకులు బుజ్జిరెడ్డి, భాస్కర్ రెడ్డి, లీలారాం, ప్రకాష్, యేసు, జయరామ్, రంగనాథం, ఏలుమలై రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, రామదాసు, నాగరాజు, జయకుమార్, మూర్తి, నాగభూషణం పాల్గొన్నారు.

‘వసతి’లో సమస్యలపై నిరసన



ఆర్డీఓకు వినతిపత్రం అందిస్తున్న విద్యార్థులు

తిరుపతి రూరల్ : నగరంలోని బాలుర ఎస్సీ వసతి గృహంలో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ విద్యార్థి సంఘాల నేతలు కోరారు. గురువారం ఈ మేరకు ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం ఆర్డీఓ రామ్మోహన్‌కు వినతి పత్రం అందించారు. పీడీఎస్‌ఓ జిల్లా కార్యదర్శి ఆర్.ఆషా మాట్లాడుతూ ఎమ్మార్‌పల్లె సర్కిల్‌లోని బాలుర ఎస్సీ హాస్టల్లో మౌలిక వసతులు లేవన్నారు. 200 మంది విద్యార్థులుంటే కనీసం దాహం తీర్చుకునేందుకు తాగునీరు సైతం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్క వర్కర్ మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నట్లు వెల్లడించారు. దీంతో పిల్లలకు సకాలంలో భోజనం వడ్డించడం కూడా ఆలస్యమవుతోందని, దీంతో చాలామంది ఆకలితోనే కాలేజీకి వెళ్లిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆర్డీఓకు విన్నవించారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం



మాట్లాడుతున్న ఎంపీపీ బాలం యుగంధర్‌రెడ్డి

చిన్నగొట్టిగల్లు : ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రాధాన్యమివ్వాలని ఎంపీపీ బాలం యుగంధర్‌రెడ్డి ఆదేశించారు. గురువారం శ్రీ శక్తి భవన్‌లో చిన్నగొట్టిగల్లు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ అభివృద్ధి పనులకు పెద్దపీట వేయాలని కోరారు. తహసీల్దార్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలపై వీఆర్‌ఓలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ మండలమీట్‌కు ఆలస్యంగా వచ్చిన అధికారులపై మండిపడ్డారు. దిగవూరు సర్పంచ్ శంకర్ రెడ్డి మాట్లాడుతూ రోడ్లకు మరమ్మతులు చేయకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. దేవరకొండ సర్పంచ్ విజయ కుమార్ మాట్లాడుతూ పోలీసుల అండతో భూకబ్జాలు పెరుగుతున్నాయని ఆరోపించారు. భాకరాపేట సర్పంచ్ భూపాల్ మాట్లాడుతూ భూముల రీసర్వేలో ఒక్కో రైతుకు ఒక్కో ల్యాండ్ పర్మినెంట్ నంబర్ మంజూరు చేయకుండా, నలుగురైదుగురికి ఒక నంబర్ చొప్పున ఇచ్చారని మండిపడ్డారు. దీంతో రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో వైస్ ఎంపీపీ దామోదర్ రెడ్డి పాల్గొన్నారు.

నేడు పీసీ రాయులు జన్మదినోత్సవం

తిరుపతి కల్చరల్ : కస్తూర్బాగాంధీ కేంద్ర ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పీసీ రాయులు పుట్టినరోజు వేడుకలను శుక్రవారం సాయంత్రం 6 గంటలకు కచ్చపి ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టనున్నారు. అందులో భాగంగా మధ్యాహ్నం ఒంటి గంటకు గాంధీ రోడ్డులోని ట్రస్ట్ కార్యాలయం వద్ద వెయ్యి మంది పేదలకు అన్నదానం చేయనున్నారు.. ఉదయం 6 నుంచి 7 గంటల వరకు శిల్పారామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వ హించనున్నారు. ఉదయం 11 గంటలకు తిరుమలలో అన్నప్రసాదం కోసం టీటీడీకి రూ.10 లక్షల విరాళం అందించనున్నారు.

అమ్మవారి సేవలో మహారాష్ట్ర మంత్రి



ఆలయం వెలుపల మంత్రి పంకజ్ ముండే

చంద్రగిరి : తిరుచానూరు పద్మావతి అమ్మవారిని గురువారం మహారాష్ట్ర మంత్రి పంకజ్ ముండే కుటుంబసమేతంగా సేవించుకున్నారు. ఆమెకు ఆలయ సూపరింటెండెంట్ రమేష్ స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేద పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

అలంకారం.. నిఘా నేత్రం



సీసీ కెమెరాలు లేని తూర్పువైపు ప్రధాన ద్వారం

పనిచేయని సీసీ కెమెరాలు





కలెక్టరేట్ భవన అండర్‌గ్రౌండ్‌లోని పార్కింగ్‌లో ఏర్పాటు చేసిన 5 సీసీ కెమెరాలు అలంకారంగా మారాయి. నెల నుంచి పనిచేయకపోయినా పట్టించుకునేవారు లేక దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. ఇక్కడ నిత్యం 500లకు పైగా ద్విచక్రవాహనాలు.. 50కి పైగా కార్లు పార్క్ చేస్తూ ఉంటారు. అయితే నిఘా నేత్రాలు నిర్వీర్యం కావడంతో వారంలోనే రెండు స్కూటర్లను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. దీంతో కలెక్టరేట్ సిబ్బంది తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. తమ వాహనాలకు భద్రత కరువైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో వెంటనే సీసీ కెమెరాలు పనిచేసేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఈ క్రమంలోనే కలెక్టరేట్ ప్రధాన ద్వారా వద్ద నిఘా నేత్రాలు లేకపోవడంతోనే తాగునీటి ఫ్రిజ్ సైతం చోరీకి గురైనట్లు ఆరోపిస్తున్నారు. - తిరుపతి అర్బన్